సాక్షి కామారెడ్డి

గురువారం । 20 । జూన్ । 2024



ఆర్థికాభివృద్ధి సాధించాలి

మహిళా సంఘాల సభ్యులు ఆదాయం వచ్చే కార్యక్రమాలు నిర్వహించి, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐకేపీ డీపీఎం సూచించారు.

- 9లో ▸



నాణ్యత లేని విత్తనాలు..

బిచ్కుందలో విత్తన వ్యాపారి నాణ్యత లేని సోయా విత్తనాలు ఇచ్చారని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.9 /24.4

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

21న యోగా దినోత్సవం

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు స్థానిక జయశంకర్‌కాలనీలోని జిల్లా యోగా భవన్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని యోగా, స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కేంద్ర ప్రభుత్వ ప్రచార అధికారి ధర్మనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కేవీఆర్‌తోపాటు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ తదితరులను ఆహ్వానించామని పేర్కొన్నారు. జిల్లాలోని యోగా గురువులు, యోగా అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రోహిత్



కామారెడ్డి టౌన్: ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా పట్టణానికి చెందిన కుంట రోహిత్ నియమితులయ్యారు. వరంగల్‌లో జరిగిన ఏబీవీపీ ప్రాంత అభ్యాస వర్గలో రాష్ట్ర కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. తనకు అవకాశమిచ్చిన రాష్ట్ర కార్యవర్గానికి ఆయన రోహిత్ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల బస్‌పాస్‌లకు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు..

ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల బస్‌పాస్‌ల కోసం అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు చెల్లించాలని ఆర్‌ఎం జానీరెడ్డి సూచించారు. పాస్‌లు ఇవ్వడానికి ఆరు డిపోలలో ఏర్పాట్లు చేశామన్నారు. చార్జీలు చెల్లించి విద్యాసంస్థలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందాలని సూచించారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో పాస్ కోసం అప్లై చేసుకోవాలని, ఆ దరఖాస్తును ఆయా విద్యా సంస్థలు అప్రూవ్ చేశాక పాస్ పొందవచ్చని వివరించారు.

త్వరగా పనులు పూర్తి చేయాలి

కామారెడ్డి క్రైం: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ల వారీగా అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ అధికారులు పాఠశాలలను పర్యవేక్షించి వారంలోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు సహకరించకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈనెల 28 లోగా పనులు పూర్తి చేయకపోతే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. డీఆర్‌డీవో చందర్, డీఈవో రాజుతో మాట్లాడి యూనిఫామ్‌ల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులకు త్వరగా యూనిఫామ్స్ అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వెల్ఫేర్ ఆఫీసర్ల పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

సుభాష్‌నగర్: టీజీపీఎస్‌సీ ద్వారా ఈనెల 24 నుంచి 29 వరకు జరగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపా రు. పరీక్ష ప్రారంభమయ్యే మూడురోజుల ముందు నుంచి కమిషన్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు కొనసాగుతాయన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. మార్నింగ్ సెషన్‌కు సంబంధించి ఉదయం 8.30 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రంలోనికి అనుమతిస్తారని, 9.30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసేస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. మధ్యాహ్నం సెషన్ పరీక్షకు ఒంటి గంట నుంచి కేంద్రం లోనికి అనుమతిస్తారని, 2 గంటలకు గేట్లు మూసేస్తారని వివరించారు.

మరో నలుగురి రిమాండ్

మోపాల్: కాల్పోల్‌లో ఐదు రోజుల క్రితం ఫారెస్ట్ అధికారులపై దాడి చేసిన కేసులో గ్రామానికి చెందిన మరో నలుగురిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ తెలిపారు. జీవన్‌సింగ్, జైల్‌సింగ్, బాబూలాల్, మచ్చులను రిమాండ్‌కు తరలించామన్నారు. అటవీ భూమిని చదును చేస్తున్నారన్న సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లిన ఫారెస్ట్ అధికారులపై గ్రామస్తులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఈనెల 16న ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించారు.

హస్తంలో అలజడి!

- బాన్సువాడ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం
- వ్యతిరేకిస్తున్న స్థానిక నేతలు
- పోచారం చేరికను అడ్డుకుంటామంటూ ప్రకటనలు

సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కారు దిగి, కాంగ్రెస్‌లో చేరుతారంటూ జరుగుతున్న ప్రచారంతో హస్తం పార్టీలో అలజడి మొదలయ్యింది. దశాబ్దాలుగా ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నవారు, వివిధ కారణాలతో బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన నేతలు దీనిని జీర్ణించుకోలేకపోతున్నారు. పోచారంను పార్టీలో చేర్చుకోవద్దంటూ కాంగ్రెస్ నేతలు ఆందోళనలకు దిగుతుండడం చర్చనీయాంశంగా మారింది.

సాక్షి, కామారెడ్డి: బాన్సువాడ నియోజకవర్గంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి తిరుగులేని నేతగా ఎదిగారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, అసెంబ్లీ స్పీకర్‌గా వివిధ హోదాల్లో పనిచేస్తూ నియోజకవర్గంలో పట్టు పెంచుకున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గాలిలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓటమి పాలైనా.. ఆయన మాత్రం మరోసారి భారీ మెజారిటీతో విజయం సాధించారు. అలాంటి నేత పార్టీ మారతారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ గూటికి చేరతారన్న ప్రచారం జరుగుతున్నా దానిని పోచారం ఖండించకపోవడంతో దీనికి మరింత బలం చేకూర్చింది.

పట్టుకోసం ప్రయత్నాలు..

బాన్సువాడ నియోజకవర్గంలో పట్టు కోసం కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలను చాలెంజ్‌గా తీసుకుని, మెజారిటీ తీసుకురావడానికి శ్రమించారు. నియోజకవర్గంలో తరచూ పర్యటిస్తూ పార్టీ బలోపేతంపై దృష్టి సారించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నేతలను కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చారు.



నస్రుల్లాబాద్‌లో పోచారం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇక్కడ కాసుల బాల్‌రాజు ఆధ్వర్యంలో మరో వర్గం ఉన్నా.. ఏనుగు రవీందర్‌రెడ్డి తన ఆధిపత్యం చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. మెజారిటీ క్యాడర్ ఆయన వెంటే నడుస్తోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును పలుమార్లు రప్పించి, నియోజకవర్గంలో మరింత పట్టు సాధించే ప్రయత్నం చేశారు.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను బలహీన పరిచేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు గాలం వేస్తోంది. ఈ క్రమంలో పోచారం కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఈ ప్రచారం కాంగ్రెస్ నేతలను కలవరానికి గురిచేస్తోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా లేకున్నా పలువురు నేతలు పార్టీ జెండాను మాత్రం వీడలేదు. పార్టీని కాపాడుకునేందుకు దశాబ్దాలుగా పోచారం శ్రీనివాస్‌రెడ్డికి

కాంగ్రెస్ నేతల్లో కలవరం

వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. వీరితోపాటు వివిధ కారణాలతో బీఆర్‌ఎస్‌ను వీడగి కాంగ్రెస్‌లో చేరిన నేతలు సైతం పోచారం కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారంతో ఆందోళన చెందుతున్నారు. ఇన్నాళ్లు పోచారం మీదనే పోరాటం చేసిన తాము.. ఆయన కింద ఎలా పనిచేస్తామని ప్రశ్నిస్తున్నారు. పోచారం కాంగ్రెస్‌లోకి వస్తే మళ్లీ ఆయన ఆధిపత్యమే కొనసాగుతుందని భావిస్తున్నవారు.. ఆయన రాకను అడ్డుకుంటామని ప్రకటిస్తున్నారు. పోచారంను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ ఇప్పటికే ఆందోళన బాట పట్టారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో కాంగ్రెస్ నేతలు ప్రెస్‌మీట్‌లు ఏర్పాటు చేస్తూ పోచారం రాకను అడ్డుకుంటామని ప్రకటిస్తున్నారు. బుధవారం నస్రుల్లాబాద్ మండలంలో పోచారం దిష్టిబొమ్మను దహనం చేశారు. పోచారంను చేర్చుకునే విషయంలో పార్టీ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యత

- ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూస్తా
- మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- 'సాక్షి'తో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, కామారెడ్డి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తానన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు తీసుకున్న సంగ్వాన్.. బుధవారం రోజంతా అధికారులతో సమీక్షలు నిర్వహించారు. బుధవారం రాత్రి 'సాక్షి'తో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనపై ఇప్పటికే సమీక్షించానని కలెక్టర్ పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించానన్నారు. విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్స్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్య సేవలు మెరుగ్గా అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌తో పాటు డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెడతానని కలెక్టర్ సంగ్వాన్ తెలిపారు. తాగునీటి సమస్య, పారిశుధ్యం వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

తొలిరోజే రివ్యూలతో హడల్

- వివిధ శాఖలపై సమీక్షించిన కలెక్టర్ సంగ్వాన్
- అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- అధికారులు, సిబ్బందిలో వణుకు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత బుధవారం తొలిరోజు విధుల్లో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.. వివిధ శాఖల అధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహించారు. బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులతో వార్షిక రుణ ప్రణాళికపై సమీక్షించిన కలెక్టర్.. గతేడాది రుణ లక్ష్యాన్ని చేరుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులతో రివ్యూలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈనెల 28వ తేదీలోగా పనులు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని ఇంజినీరింగ్ అధికారులను హెచ్చరించారు. దీంతో అధికారుల్లో వణుకు మొదలయ్యింది.

క్షేత్ర స్థాయి పర్యటనలకు సిద్ధం..

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ క్షేత్ర స్థాయి పర్యటనలకూ సిద్ధమవుతున్నారు. ఆయన గ్రామాలకు వెళ్లి వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలించనున్నారు. ఉదయమే క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాల్సి ఉంటుందని సిబ్బందికి సూచించడంతో వారు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. కాగా కలెక్టర్ సంగ్వాన్ ప్రతి అంశంపై లోతుగా వివరాలు తెలుసుకుంటున్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీంతో అధికారుల్లో వణుకు మొదలయ్యింది.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

నూతన కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ శాఖల అధికారులు, సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు కలెక్టరేట్‌కు క్యూ కట్టారు. అయితే కలెక్టర్ రోజంతా సమీక్షలతో బిజీగా ఉండడంతో వారంతా కాసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఆయన రాత్రి వరకు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఉండి, అందరినీ కలిశారు.

పదోన్నతుల ప్రక్రియ పూర్తి

- ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయులు
- జిల్లాలో 787 మందికి ప్రమోషన్
- రేపటి నుంచి ఎస్జీటీల బదిలీలు

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల కల నెరవేరింది. ఎట్టకేలకు పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో ఆయా కేటగిరిల్లో స్థానిక సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 787 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు పొందారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా 103 మందికి ప్రమోషన్ లభించింది. స్కూల్ అసిస్టెంట్లుగా ఇంగ్లిష్ -30, గణితం- 39, తెలుగు- 201, బయో సైన్స్- 36, హిందీ-178, ఫిజికల్ ఎడ్యుకేషన్ -75, ఫిజికల్ సైన్స్- 19, సోషల్ స్టడీస్- 99, స్పెషల్ ఎడ్యుకేషన్ -2, ఉర్దూ-5 మంది పదోన్నతి పొందారు. వీరందరు బుధవారం డీఈవో కార్యాలయంలో ఆర్డర్ కాపీలను తీసుకుని వారివారి స్థానాలలో జాయిన్ అయ్యారు.



బదిలీల ప్రక్రియ..

జిల్లాలో బదిలీల కోసం 1400 మంది ఎస్జీటీలు ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్‌లు ఇచ్చారు. పదోన్నతుల ప్రక్రియ పూర్తి కావడంతో వారి ఖాళీల తుదిజాబితాను ప్రకటించనున్నారు. శుక్రవారం నుంచి బదిలీల ప్రక్రియను ప్రారంభించనున్నారు. 20 తేదీ సాయంత్రం 5 గంటలలోపు కేడర్ల వారీగా దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో ఎస్.రాజు తెలిపారు. ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తై, గతంలో దరఖాస్తు చేసుకోని వారు, అలాగే రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని బదిలీలకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'నీట్' లీకేజీపై విచారణ జరిపించాలి



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి టౌన్: నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని కామారెడ్డి విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్-యూజీ ఎంట్రెన్స్ పరీక్షలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేశ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, ఎస్ఎస్‌యూవి జిల్లా కార్యదర్శి భరత్, నాయకులు మణికంఠ, బుల్లెట్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట రుణాలివ్వాలి

- వంద శాతం లక్ష్యాలను చేరుకోవాలి
- బ్యాంకర్లతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: రైతులకు పంట రుణాలను అందించడంలో ఉదారంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రుణ లక్ష్యాల పురోగతిపై సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు, టర్మ్ లోన్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, విద్య, గృహ నిర్మాణం, తదితర రంగాలకు రూ.5,569 కోట్ల రుణాలు అందించాల్సి ఉండగా.. 78.60 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారని పేర్కొన్నారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా శాఖల అధికారాలు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేసి వంద శాతం లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలన్నారు. కోల్డ్ స్టోరేజీలు, గోదాముల నిర్మాణాలకు బ్యాంకులు రుణాలు ఇస్తాయని, వాటి నిర్మాణానికి రైతులు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన బ్యాంక్ లింకేజీ రుణాల లక్ష్యాలను అధిగమించాలన్నారు. 2016-17 నుంచి 2021-22 వరకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ మంజూరై, పెండింగ్‌లో ఉన్న యూనిట్‌లను వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. మత్స్య సహకార సంఘాల సభ్యులు మార్కెటింగ్ కోసం చేసుకున్న దరఖాస్తులను సిబిల్ స్కోర్, ఇతర కారణాలతో తిరస్కరించకుండా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని బ్యాంకర్‌లకు సూచించారు. కిసాన్ క్రెడిట్ కార్డు కింద పాడిరైతులు, గొర్రెల పెంపకందారులకు ఎలాంటి మార్టిగేజ్ లేకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నారిశక్తి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ పథకం కింద ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా రూ.2 కోట్ల వరకు వివిధ వ్యాపారాలకు రుణాలు అందిస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడడమే కాకుండా మరి కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, లీడ్ జిల్లా మేనేజర్ రహమాన్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, కెనరా బ్యాంక్ డీఎం తోరత్, డీసీసీబీ జనరల్ మేనేజర్ ఫణి సాయిరాం, యూనియన్ బ్యాంకు ఆర్‌ఎం వికాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 6,412.60 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

కామారెడ్డి క్రైం: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పంట రుణాలు, అగ్రికల్చర్ టర్మ్ లోన్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, తదితర రంగాలకు రుణాల కోసం రూ.6,412.60 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్ల సమావేశం అనంతరం జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళికలో రూ. 5,610.28 కోట్లు (87.48 శాతం) ప్రాధాన్యత రంగాలకు కేటాయించామన్నారు. మరో రూ.802.28 కోట్లు (12.51 శాతం) ఇతర రంగాలకు కేటాయించామని పేర్కొన్నారు. ప్రధానంగా రూ.3,425.85 కోట్ల మేర పంట రుణాలు, రూ.732.38 కోట్లు టర్మ్ రుణాలు, రూ.537.73 కోట్ల వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ అనుబంధ సాంకేతిక పరికరాల కొనుగోళ్లకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.700.94 కోట్లు, విద్య, గృహ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక శక్తికి రూ. 213.38 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, లీడ్ జిల్లా మేనేజర్ రహమాన్, కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ తోరత్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

ఇక వేగంగా విస్తరణ పనులు!

- జాతీయ రహదారి 63ను విస్తరించడానికి కేంద్రం నిర్ణయం

ఆర్మూర్/మోర్తాడ్: నిధుల కేటాయింపులో తీవ్ర జాప్యం, భూ సేకరణ అంశం కొలిక్కి రాకపోవడం తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారి 63 విస్తరణ పనులు ఇక నుంచి వేగంగా సాగనున్నాయి. మోదీ 3.0 వందరోజుల ప్రణాళికలో భాగంగా తెలంగాణలోని రెండు జాతీయ రహదారుల విస్తరణపై కేంద్రం దృష్టి సారించింది. ఇప్పటి వరకు ఈ రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగకపోగా మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయడం, జాతీయ రహదారుల విస్తరణపై కేంద్రం దృష్టి సారించడంతో పనుల్లో కదలిక రానుంది. కేంద్రం ఎంపిక చేసిన రెండు రోడ్ల విస్తరణలలో జాతీయ రహదారి 63కు చోటు దక్కడంతో త్వరలోనే నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం పనులకు బీజం పడనుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. నిజామాబాద్-ఛత్తీస్‌ఘడ్‌లోని జగ్దల్‌పూర్‌ల మధ్య విస్తరించిన జాతీయ రహదారి 63పై భారీ ట్రక్కులు రవాణా జోరుగా సాగుతుండటంతో ఈ రోడ్డును విస్తరించాలని కేంద్రం గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఇప్పటికే జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌ఏచ్ఏఐ)కి ప్రాజెక్టును అప్పగించారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం రూ.3,850 కోట్లు ఖర్చు చేయాలని అంచనాకు వచ్చింది. రాష్ట్రంలో ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల్ వరకు 131.8 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ చేయనున్నారు. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి రోడ్డు విస్తరణ, బైపాస్ రోడ్ల కోసం 83.895 హెక్టార్ల భూమిని సేకరించనున్నారు. జాతీయ రహదారి కోసం తాము వ్యవసాయ భూములు ఇవ్వబోమని రైతులు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటి వరకు భూ సేకరణ ముందుకు సాగలేదు. కేంద్రం మాత్రం జాతీయ రహదారుల విస్తరణలో 63 నంబర్ హైవేకు అవకాశం ఇవ్వడంతో భూ సేకరణ, రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగనున్నాయని వెల్లడి అవుతుంది.



మోర్తాడ్‌లో విస్తరణకు నోచుకోనున్న రహదారి

ఉపాధి పనుల్లో తప్పిదాలపై షోకాజ్ నోటీసులు

నిజాంసాగర్(జుక్కల్): ఉపాధి పనుల కల్పనతో పాటు రికార్డులు, మస్టర్ల నిర్వహణ, కొలతల్లో తప్పిదాలపై టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్‌అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఈజీఎస్ ఏపీడీ వామనరావు ఆదేశించారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల వారీగా సోషల్ ఆడిట్ బృందం చేపట్టిన సామాజిక తనిఖీ వివరాలను ప్రజా వేదికలో చదివి వినిపించారు. ఉపాధి హామీ పనుల్లో మాగి గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ బాల్‌రాజ్ పొక్లెయిన్ యంత్రాన్ని ఉపయోగించినట్లు గ్రామానికి చెందిన సుదర్శన్ ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. సింగితం గ్రామ పంచాయతీలో కూలీలకు అదనంగా డబ్బులు చెల్లించడంతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.1,430 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఏపీవో శ్రీనివాస్, సోషల్ ఆడిట్ డీఆర్పీ దేవేందర్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈజీఎస్ ఏపీడీ వామనరావు

క్లుప్తంగా

నేడు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సమావేశం



బోధన్: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని పట్టణంలోని ఉర్దూఘర్‌లో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మండల ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్, ఎం.అడవయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలతోపాటు పింఛన్ల పెంపు, ఉచిత బస్‌పాస్‌లు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, స్వయం ఉపాధి అంశాలపై చర్చ ఉంటుందని వివరించారు. వేదిక మండల అధ్యక్షుడు గైని రాములు, ప్రతినిధులు షేక్ నజీర్, దత్తాత్రి, ఎల్లయ్య, కరీం, నయీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుకు సన్మానం



సుభాష్‌నగర్: నగరంలోని కలెక్టరేట్‌కు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్‌ను రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రెసా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెవెన్యూశాఖలో నెలకొన్న సమస్యలతోపాటు ధరణి సమస్యలను షబ్బీర్ అలీకి విన్నవించారు. సానుకూలంగా స్పందించిన షబ్బీర్ అలీ.. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రెవెన్యూ సమస్యల పరిష్కారించడంతోపాటు రెవెన్యూ సంఘం ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపినట్లు ట్రెసా ప్రతినిధులు తెలిపారు. షబ్బీర్‌ను కలిసిన వారిలో ట్రెసా ప్రధానకార్యదర్శి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యక్షుడు భూపతి ప్రభు, తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, బాలరాజు, నాగార్జున, మహేశ్, సూపరింటెండెంట్లు పవన్, రాంచందర్, శ్రీకాంత్, దివ్య, అనిల్, సంతోష్, సంపత్, ప్రవీణ్ ఉన్నారు.

స్థల వ్యవహారంలో కొడుకుపై ఫిర్యాదు

కామారెడ్డి క్రైం: నలుగురు కొడుకులకు చెందాల్సిన స్థలాన్నీ ఎవరికీ తెలియకుండా ఒక్కడే రిజిస్ట్రేషన్ చేయించుకుని మోసం చేశాడని పట్టణానికి చెందిన రుక్మిణీబాయి అనే మహిళ తన కొడుకుపై బుధవారం కామారెడ్డి తహసీల్దార్ జనార్దన్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు మొత్తం నలుగురు కొడుకులు ఉన్నారని, ఇందిరానగర్ కాలనీలో ఉన్న 185 గజాల స్థలాన్ని తన మూడో కుమారుడు శ్రీనివాస్ ఎవరికీ తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని తెలిపింది. ఈ విషయమై చిన్న కొడుకు ప్రశ్నిస్తే అతడికి 50 గజాలు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడని, మిగితా ఇద్దరికి అన్యాయం చేశాడని ఆరోపించింది. తమకు న్యాయం చేయాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసింది.



సుభాష్‌నగర్‌లోని బుక్‌స్టాల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



గంజ్‌లోని విత్తనాల దుకాణంలో రైతులు

బడిబాట **సాగుబాట**

స్కూళ్లు పునఃప్రారంభం కావడంతో ఓ వైపు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో.. ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభం కావడంతో మరోవైపు రైతులతో మార్కెట్ కిటకిటలాడుతోంది. బుక్‌స్టాళ్లు, ఎరువులు, విత్తనాల దుకాణాలు కిక్కిరుస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అవినీతికి తావు లేకుండా అభివృద్ధి



మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

ఆర్మూర్: అవినీతికి తావు ఇవ్వకుండా, మధ్యవర్తులకు వాటాలు, కమీషన్లు లేకుండా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఎంపీ అర్వింద్ గెలుపులో ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు కీలకంగా వ్యవహరించారని అన్నారు. ఆర్మూర్‌కు మంచి రోజులు వస్తున్నాయని, స్థానికంగా అభివృద్ధి చేసి చూపుతానని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డితోపాటు నలుగురు కేంద్ర , రాష్ట్ర మంత్రులను కలిసి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరగా, వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. నందిపేట్‌లో అతిథిగృహం, మాక్లూర్‌లో మహిళా కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. గుంజిలి, కంఠం , మచ్చర్ల, ఫత్తేపూర్ ఎత్తిపోతల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఆర్మూర్ రైల్వే జంక్షన్‌ను డిచ్‌పల్లి లైన్‌కు కలపాలని రైల్వే మంత్రిని కోరగా, సానుకూలంగా స్పందించిన ఆయన అధికారులను పంపించి సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. జక్రాన్‌పల్లిలో ఎయిర్ పోర్టు ఏర్పాటు విషయమై కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అధికారులు అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఆర్మూర్ మున్సిపల్ మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, జిల్లా అధికార ప్రతినిధి కలికోట గంగాధర్, నాయకులు పాన్ శ్రీనివాస్, ఆకుల రాజు, జాగిర్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ జర్నలిస్ట్ అశోక్ ఆత్మకుశాంతి కలగాలని కోరుతూ ఎమ్మెల్యేతోపాటు నాయకులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

మినీ లిఫ్ట్‌కు విఠలేశ్వరుని పేరు పెట్టాలి



బొంకన్‌పల్లిలో మాట్లాడుతున్న విఠల్‌రావు

మాక్లూర్: త్వరలో ప్రారంభం కానున్న మినీ లిఫ్ట్‌కు విఠలేశ్వరుని పేరు పెట్టాలని మండలంలోని ముల్లంగి(బి), బొంకన్‌పల్లి గ్రామాల రైతులు జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుకు బుధవారం విన్నవించారు. ముల్లంగి(బి) గ్రామానికి వచ్చిన జెడ్పీ చైర్మన్ ఈ సందర్భంగా వారు కలిశారు. సానుకూలంగా స్పందించిన జెడ్పీ చైర్మన్ మినీ లిఫ్ట్‌కు ×విఠలేశ్వర లిఫ్ట్‌¤ అనే పేరు ఖరారు చేస్తామని హామీ ఇచ్చారు. రెండు గ్రామాల పరిధిలో వెయ్యి ఎకరాలకు నీరందించడమే లక్ష్యంగా రూ.11.70 కోట్లతో ధర్మోరా చెరువులో గుత్ప ఎత్తిపోతల నీటిని ఆధారంగా చేసుకొని లక్ష్మాపూర్ పంప్‌హౌస్ వద్ద మినీ లిఫ్ట్ నిర్మాణం అవుతోందన్నారు. అనంతరం పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ప్రభుత్వం అందించిన పాఠ్య, నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె క్రాంతి, కె శ్యామ్‌రావు, ఎంపీటీసీ పూజిత, శైలు, ప్రమోద్, శ్రీరామ్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉర్దూఘర్‌కు పూర్వవైభవం తెస్తాం



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ తాహెర్

బోధన్‌టౌన్(బోధన్): ఉర్దూఘర్‌కు పూర్వవైభవం తీసుకువస్తామని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డైరెక్టర్ లియాఖత్ హుస్సేన్ అన్నారు. పట్టణంలోని ఉర్దూఘర్‌ను బుధవారం అధికారులతో కలిసి సందర్శించారు. ఉర్దూ ఘర్ నిరుపయోగంగా మారడానికి కారణాలు తెలుసుకున్నారు. ఉర్దూఘర్ ఆవరణలో ఇతరులు దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ఎవరు అనుమతించారని ప్రశ్నించారు. దీనిపై ఏడు రోజుల్లో నివేదిక అందించాలని తహసీల్దార్ గంగాధర్‌ను ఆదేశించారు. ఏడేళ్ల క్రితం కలెక్టర్ వేసిన కమిటీ రద్దయ్యిందని, నూతన కమిటీని ఏర్పాటు చేసి ఉర్దూఘర్ నిర్వహణలోకి వచ్చేలా చర్యలు చేపడుతామన్నారు. వారివెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, మీర్ నజీర్ అలీ, ఇమ్రాన్, శ్రీకాంత్‌గౌడ్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, యువజన కాంగ్రెస పట్టణ అధ్యక్షుడు నవీన్, పట్టణ ప్రధాన కార్యదర్శి విష్ణు, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌసొద్దీన్ తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్ హాస్టల్‌లో ఖాళీల భర్తీకి ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్ రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్, అకాడమీలో ఖాళీల భర్తీకి ఈనెల 24, 25 తేదీల్లో ఉదయం 9గంటలకు పలు అకాడమీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల యువజన అధికారి ముత్తెన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సున్న బాలబాలికలు నేరుగా హాజరు కావాలని, స్టడీ సర్టిఫికెట్స్, బర్త్ సర్టిఫికెట్, 10 ఫొటోలు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని సూచించారు.

ఖాళీలు ఇలా..

సైక్లింగ్, కుస్తీ ఎంపికలు హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్ అకాడమీలో ఉంటాయని, పూర్తి వివరాలకు 98663 17310, హనుమకొండలోని రీజినల్ స్పోర్ట్స్ అకాడమీ సీట్ల భర్తీ కోసం స్థానిక డీఎస్‌ఏ మైదానంలో ఎంపికలు ఉంటాయని, వివరాలకు 9392997668, వనపర్తిలోని హాకీ అకాడమీలో భర్తీ కోసం అక్కడి డీఎస్‌ఏ మైదానంలో ఎంపికలు ఉంటాయని, వివరాల కోసం 9885851813 సంప్రదించాలని సూచించారు. అలాగే సరూర్‌నగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా వాలీబాల్ అకాడమీల్లో సీట్ల భర్తీ కోసం రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఎంపికలు ఉంటాయని, వివరాల కోసం 9440239783 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని బస్వాగార్డెన్‌లో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరు కానున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరా రు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించాలని, వాటికి సంబంధించిన ఫొటోలను 9100435410 నంబర్‌కు పంపితే కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు.

అనుమతి తప్పనిసరి

ఖలీల్‌వాడి: జిల్లాలోని హోటళ్లు, రెస్టారెంట్లు, గేమింగ్ జోన్‌లు, పార్కులు సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని ఇకపై అధికారులు, పోలీసుల అనుమతి తప్పనిసరి అని సీపీ కల్మేశ్వర్ గురువారం పేర్కొన్నారు. సంబంధిత శాఖల నుంచి అనుమతి లేకుండా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని డివిజన్ స్థాయి అధికారులకు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వో, ఎస్సైలకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

నాణ్యత లేని విత్తనాలు ఇచ్చారంటూ ఫిర్యాదు



విత్తనాలను పరిశీలిస్తున్న ఏవో, ఎస్సై

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో విత్తనాలు విక్రయించే ఓ దుకాణదారుడు నాణ్యత లేని సోయా విత్తనాలు ఇచ్చారని ఆరోపిస్తూ బుధవారం వ్యవసాయ అధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని భద్రాల్ తాండాకు చెందిన దీప్‌చంద్ నాయక్ 10 రోజుల క్రితం 12 సోయా విత్తనాల బ్యాగులు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. అలకడానికి మంగళవారం బ్యాగులు తెరవగా అందులో 5 బ్యాగులు ముక్కిపోయి నాణ్యత లోపించి నల్లగా ఉన్నాయి. బుధవారం వాటిని దుకాణానికి తీసుకొచ్చాడు. రైతు ఇంటిలో జాగ్రత్తగా బ్యాగులు పెట్టకపోవడంతో నీటి తేమతో విత్తనాలు తడిసి నల్లగా మారాయని దుకాణదారుడు చెబుతున్నారు. ఇతర రైతులకు ఇదే కంపెనీ విత్తనాలు ఇచ్చామని, ఎలాంటి ఫిర్యాదు లేదని దుకాణాదారుడు చెప్పారు. మీ తప్పిదం వల్ల గోదాంలోనే తడిసాయని, ఇంటిలో భద్రంగా ఉంచామని రైతు వ్యవసాయ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విత్తనాలను రైతు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు, వ్యవసాయ అధికారులు కలిసి విత్తనాలను పరిశీలించారు. నీటి తేమతో విత్తనాలు చెడిపోయాయని, ల్యాబ్‌కు పంపిస్తామని విత్తనాల శాంపిల్ సేకరించారు. గోదాం వెళ్లి విత్తనాల లాట్‌ను పరిశీలించారు. అధికారులు దుకాణదారులతో మాట్లాడి రైతుకు వేరే విత్తనాల బ్యాగులను అందించారు. ఇళ్లలో విత్తనాలు వర్షానికి తడవకుండా జాగ్రత్తగా పెట్టుకోవాలని అధికారులు సూచించారు.



నల్లగా ఉన్న విత్తనాలు

కలెక్టర్‌ను కలిసిన చైర్‌పర్సన్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి టౌన్: జిల్లాకు నూతన కలెక్టర్‌గా వచ్చిన ఆశిష్ సంగ్వాన్‌ను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్‌కు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రధాన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉర్దోండ వనిత, కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ ఉన్నారు.

మటన్ మార్కెట్ పరిశీలన

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సుభాష్‌రోడ్‌లో గల మటన్ మార్కెట్ దుకాణాల సముదాయాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ కన్నయ్య మార్కెట్‌లోని సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. దుకాణాల స్లాబ్‌లు లీకేజీతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రధాన గేట్, నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వనిత, కమిషనర్ సుజాత, సానిటరీ ఎస్సై రవీందర్, కౌన్సిలర్లు శివకృష్ణమూర్తి, వంశీ, రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

● కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు

దోమకొండ: పోలీస్ స్టేషన్లో పెండింగ్ కేసులు లేకుండా సత్వరమే పరిష్కరించేలా చూడాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం దోమకొండ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ పరిధిలోని సీఐలు, ఎస్సైలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా దర్యాప్తు చేపట్టాలని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోలీస్ సిబ్బంది పనితీరు బాగుందని ప్రశంసించారు. పోలీస్ స్టేషన్ల వారీగా క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు,మాచారెడ్డి, దేవునిపల్లి, రామారెడ్డి, కామారెడ్డి ఎస్సైలు గణేష్, ప్రభాకర్, సాయి కుమార్, శ్రీనివాస్, రాజు, విజయ్, అనిల్, ఇంద్రసేనా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీ..ఇద్దరికి తీవ్రగాయాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని క్రిష్ణాజివాడి గ్రామ శివారులో కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బుధవారం కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. రాజంపేట మండలం ఆర్గొండకు చెందిన రాజు, సదానందం బైక్‌పై కామారెడ్డి నుంచి తాడ్వాయికి వస్తుండగా, తాడ్వాయి నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: పట్టణంలోని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు బుధవారం సమాచారం అందించారు. దేవునిపల్లి పోలీసులు చెరువు వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. ఈ నెల 12వ తేదీన కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో ఈఎన్‌టీ వైద్యం చేయించుకున్నట్లుగా మృతుని జేబులో ఓ స్లిప్ ఉందని, దానిపై యాదగిరి అని రాసి ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటుందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని ఎస్సై రాజు సూచించారు.

బోనస్‌కు ఆశపడి సైబర్ వలలో చిక్కిన యువకుడు

బాన్సువాడ రూరల్: వాట్సాప్‌లో వచ్చిన లింక్‌ను ఓపెన్ చేసి గూగుల్ మ్యాప్ రివ్యూకు రేటింగ్ ఇచ్చిన మండలంలోని తాడ్కోల్‌కు చెందిన యువకుడికి రూ.200 చొప్పున రెండుసార్లు ఫోన్‌పే ద్వారా బోనస్ జమయ్యాయి. ఆ తరువాత సదరు యువకుడికి అంజూశర్మ అనే వ్యక్తి టెలిగ్రామ్ ద్వారా మరో లింక్‌ను పంపి డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే డబ్బులు వస్తాయని తెలుపడంతో రూ.7వేలు జమ చేశాడు. మళ్లీ రాజేశ్‌కుమార్ అనే వ్యక్తి పంపిన మరో లింక్‌కు రూ.28వేలు, మన్‌దీప్ అనేవ్యక్తి పంపిన లింక్‌కు రూ.58వేలు, ఓ అకౌంట్‌నంబర్ రూ.50వేలు, మరోసారి రూ.12వేలు ఇలా పలు విడుతల్లో రూ.2.09లక్షలు పంపించాడు. అయితే, సైబర్ మోసగాళ్లు మరిన్ని డబ్బులు పంపితే అన్నీ కలిపి ఒకేసారి పంపిస్తామని చెప్పడంతో తాను మోసపోయినట్లు యువకుడు గ్రహించాడు. వెంటనే 1930కు ఫిర్యాదు చేయగా, రూ.62వేలు హోల్డ్‌లో పడ్డాయి. ఈనెల 8వ తేదీన సైబర్‌మోసం చోటు చేసుకుంది. 1930 సర్వీస్ అధికారుల సూచన మేరకు యువకుడు గురువారం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

కూలి డబ్బుల విషయంలో గొడవపడి ఆత్మహత్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కూలి డబ్బుల విషయంలో భర్తతో గొడవ పడిన భార్య క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కొలకొండ హరీశ్, లక్ష్మి భార్యాభర్తలు. హరీశ్ కూలీ పనులు చేస్తుండగా, కూలి డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన లక్ష్మి(28) ఇంట్లో ఎవరూ లేనిసమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై రాజు తెలిపారు. మృతురాలి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపానికిగురై..



గణేశ్(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని త్రియంబకపేటకు చెందిన బైరి గణేశ్(22) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. ఉపాధినిమిత్తం విదేశాలకు వెళ్లిన బైరి గణేశ్ అనారోగ్యం కారణంగా తిరిగి వచ్చేశాడని, దీనికితోడు అప్పులు కావడంతో తీవ్రమనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నా రు. మృతుడి తల్లి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం



దంపతులు సాయిలు, పోశవ్వ (ఫైల్)

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎక్లాస్‌పూర్ క్యాంపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు దుర్మరణం చెందారు. కొత్తపల్లి –కోటగిరి రోడ్డుపై చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగిరి మండలంలోని కొత్తపల్లికి చెందిన పుప్పాల సాయిలు అలియాస్ సాయిబాబా (52), పోశవ్వ(50) దంపతులు కూరగాయల కోసం మండల కేంద్రంలోని వారంతపు సంతకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. ఎక్లాస్‌పూర్ క్యాంపు వద్దకు చేరుకున్న క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోయి మృతి చెందారని స్థానికులు తెలిపారు. దంపతుల మృతితో కొత్తపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. తమతో కలిసిమెలిసి ఉండే సాయిబాబా, పోశవ్వ మృతిని జీర్ణించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనం టైర్‌పేలి లేదా గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదం జరిగి ఉంటుందని మృతుడి సోదరుడు సైదయ్య అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



రాజేశ్వర్(ఫైల్)

మాక్లూర్: మండలంలోని ఒడ్యాట్‌పల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామడోల్ల రాజేశ్వర్ (55) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. తెలుగుదేశం హయాంలో రాజేశ్వర్ రెండుసార్లు సర్పంచ్‌గా పని చేశారు. తెలంగాణ సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన బీఆర్ఎస్‌లో చేరి సర్పంచ్‌గా తన భార్య సుధను గెలిపించుకున్నారు. ఆ తరువాత మళ్లీ కాంగ్రెస్‌లో చేరి చురుకైన పాత్రపోషించారు. బుధవారం ఛాతిలో నొప్పి వస్తోందని చెప్పడంతో కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య సుధ, కుమారులు రాహుల్, నాగేంద్ర బాబు ఉన్నారు. రాజేశ్వర్ అంత్యక్రియలను శుక్రవారం స్వగ్రామమైన ఒడ్యాట్‌పల్లిలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి..



సాయిలు (ఫైల్)

పెద్దకొడప్‌గల్: ప్రమాదవశాత్తు కాలుజారి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన మేత్రి సాయిలు(28) కాలకృత్యాలు తీర్చుకునేందుకు బుధవారం ఉదయం మాలకుంట ప్రాంతానికి వెళ్లి కాలు జారిపడి నీటిలో మునిగిపోయాడు. ఊబిలో చిక్కుకుని ఊపిరాడక సాయిలు మృతి చెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సాయిలు మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడు..

నవీపేట: మండలంలోని మహంతం శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ సాయికుమార్ (24) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వ్యవసాయ పనుల్లో భాగంగా బుధవారం పొలంలో డ్రమ్ము కొడుతుండగా ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. సాయి కుమార్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అత్యాచారం చేశారని ఆరేళ్ల బాలురకు వాతలు !

మాచారెడ్డి: ఆరేళ్ల ఇద్దరు బాలురు అదే వయసున్న బాలికపై అత్యాచారం చేశారంటూ సదరు బాలిక అమ్మమ్మ ఆ బాలికతో పాటు ఇద్దరు బాలుర తొడలపై వాతలు పెట్టిన ఘటన మంగళవారం రాత్రి పాల్వంచ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కాగా ఈ ఘటన సమయంలో తాము ఇంట్లో లేమని, తమ పిల్లల తొడలపై అతి కిరాతకంగా వాతలు పెట్టిన మహిళ పై చర్యలు తీసుకోవాలని బాలుర తల్లిదండ్రులు మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక్ నగర్‌లో కొనసాగుతున్న ఓ వ్యభిచార గృహంలో పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఓ మహిళతోపాటు విటుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై సంజీవ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైతులపై దాడి చేసిన వారిపై కేసు

రుద్రూర్: పొతంగల్ మండల పరిధిలోని మంజీర నది వద్ద రైతులపై దాడి చేసిన మహారాష్ట్రకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పొలం వద్దకు వెళ్లిన తమతో దురుసుగా ప్రవర్తించి మహారాష్ట్రకు చెందినవారు దాడి చేశారని పొతంగల్‌కు చెందిన రైతు గంగారాం ఫిర్యాదు చేశాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వివాహిత అదృశ్యం

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత ఇద్దరు పిల్లలతోపాటు అదృశ్యమైంది. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బహ్రెయిన్‌లో సిర్‌పూర్‌వాసి మృతి



బాలరాజు (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన చెన్నూరు బాలరాజు (46) బహ్రెయిన్‌లో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. బాలరాజు గత 15 ఏళ్లుగా ఉపాధినిమిత్తం బహ్రెయిన్‌తోపాటు గల్ఫ్ దేశాలకు వెళ్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన బాలరాజు రెండు నెలల క్రితం తిరిగి బహ్రెయిన్‌కు వెళ్లాడు. విధుల్లో ఉండగా విద్యుత్ షాక్ తగిలి బాలరాజు శనివారం మృతిచెందగా, కుటుంబ సభ్యులకు ఐదు రోజులు ఆలస్యంగా బుధవారం రోజున కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు సమాచారం అందించారు. సమాచారమిచ్చారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో భార్య భాగ్య, ఇద్దరు కుమారులు, బంధువులు, తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తీసుకొచ్చేలా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై నలుగురికి జైలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిధుల అవకతవకల విషయంలో నలుగురు అధికారులకు జైలు శిక్ష పడినట్లు లింగంపేట ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2009 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం శెట్పల్లి సంగారెడ్డి, లొంకల్‌పల్లి, మాలపాటి, ఎక్కపల్లి, ఎక్కపల్లి తండా, సజ్జన్‌పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల నిధుల దుర్వినియోగంపై లింగంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. కోర్టులో చార్జిషీట్ వేసి కేసు విచారణ జరుపగా బుధవారం నాడు ఎల్లారెడ్డి కోర్టు మెజిస్ట్రేట్ హారిక తీర్పు ఇచ్చారు. ఈ తీర్పులో ఏఈ సంపత్‌కుమార్ (హౌజింగ్), ఏఈ బిక్కులాల్ (హౌజింగ్), విలేజ్ వాలంటీర్లు వజ్రమ్మ, రాజమణి నేరం చేసినట్లు రుజువైందని పేర్కొన్నారు.

దీంతో వారికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించారు. జరిమానా కట్టని యెడల ఆరు నెలల జైలు శిక్ష విధించారు. సదరు కేసును పీపీ వీరయ్య వాదించినట్లు ఎస్సై తెలిపారు.